

● వరి సాగుకు దుక్కులు సిద్ధం చేస్తున్న రైతులు

వానాకాలం సాగు షురూ

నిజామాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో వానాకాలం సాగు మొదలైంది. వర్షాలు ఇంకా ఆరంభం కాకున్నా బోర్ల కింద రైతులు సాగును మొదలు పెట్టారు. కరెంటు ఉండటం బోర్లలో భూగర్భ జలాలు ఉన్న రైతులు ఆరుతడి పంటల సాగుతో పాటు వరిసాగును మొదలుపెట్టారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో పసుపు, మొక్కజొన్న, సోయా సాగు చేస్తున్నారు. భారీ వర్షాలు పడే వరకు మరికొంత మంది రైతులు వేచిచూస్తుండగా డ్రిప్, స్ప్రింక్లర్ ఉన్న వారు పంటలను వేస్తున్నారు. బోధన్ డివిజన్ పరిధిలో రైతులు కొన్ని గ్రామాల పరిధిలో వరిసాగును కొనసాగిస్తున్నారు. జూన్ ఆరంభం కావడం నైరుతి రుతుపవనాల ప్రభావం ఇంకా ఎక్కువగా లేకున్నా పంటల సాగు మాత్రం రైతులు కొనసాగిస్తున్నారు. వర్షాలు ఆరంభమైతే ఎక్కువ మొత్తంలో పంటలను సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో పంటల సాగు రైతులు మొదలు పెట్టడంతో విద్యుత్ శాఖ అధికారులు కూడా ఆయా డివిజన్‌ల పరిధిలో సమీక్షించుకుంటూ వ్యవసాయానికి ఇబ్బందులు లేకుండా సరఫరా కొనసాగిస్తున్నారు. వ్యవసాయ అధికారులు విత్తన దుకాణాలను తనిఖీ చేయడంతో పాటు ఎరువులను అందుబాటులో ఉండే విధంగా చూస్తున్నారు.

- జిల్లాలో పంటల సాగు మొదలు పెట్టిన రైతులు
- బోర్ల కింద పసుపు, మొక్కజొన్న, సోయా, వరి సాగు
- భారీ వర్షాలు పడగానే అధికంగా సాగుకు సిద్ధమవుతున్న రైతులు
- నకిలీ విత్తనాలను విక్రయించకుండా దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

ఆరుతడి పంటల సాగు

జిల్లాలో భూగర్భ జలాలు ఎక్కువగా ఉన్న చోట రైతులు పంటలను వేస్తున్నారు. ఆరుతడి పంటలకు నీటి అవసరం తక్కువగా ఉండటంతో ఎక్కువ మంది రైతులు బోర్ల కింద పంటల సాగును మొదలు పెట్టారు. ఆర్మూర్ డివిజన్ పరిధిలోని రైతులు మూడు పంటలు గత కొన్నేళ్లుగా తీస్తున్నారు. పసుపుతో పాటు మొక్కజొన్నను ఏకకాలంలో సాగు చేస్తున్నారు. పసుపు సాగు పూర్తయిన తర్వాత సజ్జ, జొన్న, నువ్వుల సాగు కొనసాగిస్తున్నారు. ఆ రైతులు ప్రస్తుతం పసుపు, మొక్కజొన్న సాగు కొనసాగిస్తున్నారు. బోర్లు ఉండటం నీళ్లు ఉన్న చోట ఎక్కువ మొత్తంలో సాగు చేస్తున్నారు. పసుపుతో పాటు అంతర పంటగా మొక్కజొన్న వేస్తున్నారు. రైతులకు ఎక్కువగా డ్రిప్ సౌకర్యం ఉండటంతో వర్షాలు ఇంకా జోరుగా పడకున్నా పంటలను వేస్తున్నారు. ఇతర జిల్లాల మాదిరిగా నైరుతి రుతుపవనాలు ఇంకా జిల్లాకు చేరుకోకున్నా పంటల సాగును రైతులు కొనసాగిస్తున్నారు. గత కొన్నేళ్లుగా జూన్‌లోనే ఎక్కువ మొత్తంలో జిల్లా రైతులు పంటల సాగు కొనసాగిస్తున్నారు. ఈయేడు పసుపు ధర భారీగా పెరగడంతో ఆరుతడి పంటలు చేసే రైతులు ఎక్కువగా సాగు కొనసాగిస్తున్నారు. గత సంవత్సరం తక్కువ మొత్తంలో పసుపు సాగు చేసిన రైతులు ఈ సంవత్సరం ఎక్కువ మొత్తంలో వేస్తున్నారు. కొంత మంది రైతులకు పసుపు విత్తనం తగ్గిన ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేస్తూ తీసుకువస్తున్నారు. పసుపు సాగు కొనసాగిస్తున్నారు. వ్యవసాయ అధికారులు పసుపు సాగు స్వల్పంగా పెరుగుతుందని అంచనా వేసినా అంతకుమించి ఎక్కువ మొత్తంలో సాగు కొనసాగిస్తున్నారు. ఉద్యానవన శాఖ అధికారుల అంచనాలు బట్టి ఈ సంవత్సరం 40వేల ఎకరాల్లో పసుపు సాగు అవుతుందని అంచనాకు వస్తున్నారు. విత్తనం ధర పెరిగిన కొనుగోలు చేస్తూ పసుపు సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు.

బోధన్ డివిజన్ పరిధిలో నాట్లు

జిల్లాలో పసుపుతో పాటు మొక్కజొన్న, సోయా సాగును కూడా ఎక్కువ మంది రైతులు కొనసాగిస్తున్నారు. బోధన్ డివిజన్ పరిధిలోని వర్ని, మోస్రా, చందూర్ మండలాల పరిధిలో కొంత మంది రైతులు వరినాట్లను కూడా కొనసాగిస్తున్నారు. నైరుతి రుతుపవనాలు జిల్లాకు వచ్చి భారీ వర్షాలు పడిన తర్వాత పంటల సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉండటంతో అధికారులు కూడా రైతులకు కావాల్సిన ఎరువులను అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వానాకాలంలో ఎక్కువ మొత్తంలో పంటలు సాగు అవుతాయని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు.

5,52,128 ఎకరాల్లో సాగుకు అంచనా

జిల్లాలో ఈ వానాకాలంలో 5లక్షల 52వేల128 ఎకరాల్లో పంటలు సాగవుతుందని అధికారులు అంచనాకు వచ్చారు. ఈ పంటలకు అత్యధికంగా యూరియాను రైతులు వినియోగిస్తుండటంతో ఎక్కువ మొత్తంలో స్టాక్‌ను తెప్పించేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొంతమేర బఫర్ స్టాక్ ఉంచిన అధికారులు మరికొంత తెప్పించేందుకు సిద్ధమవుతున్నారు. వ్యవసాయం సాగు ఆరంభం కావడంతో విద్యుత్ శాఖ అధికారులు కూడా సరఫరా పునరుద్ధరించడంలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం జిల్లాలో ప్రతిరోజూ 7 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం అవుతుండగా వ్యవసాయ పంటల సాగు పెరిగితే మరికొంత డిమాండ్ పెరిగే అవకాశం ఉండటంతో అధికారులు నిమగ్నమయ్యారు. జిల్లాలో వానాకాలం పంటల సాగు మొదలైందని వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ తెలిపారు. రైతులకు వానాకాలం సాగుకు అవసరమైన మొత్తం ఏర్పాట్లను చేపట్టామని ఆయన తెలిపారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కాకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రవీందర్ తెలిపారు. వ్యవసాయానికి కావాల్సిన సరఫరా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. వానాకాలం ఆరంభానికి ముందే అన్ని మరమ్మతులు చేపట్టామని అన్నారు.



నల్లవెల్లిలో ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్

నకిలీ విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే చర్యలు

నవీపేట, జూన్ 6: మండలంలో నకిలీ విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ నారాయణ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను ఎస్సై యాదగిరి గౌడ్, ఏవో సురేష్ గౌడ్‌లతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు విత్తనాలు, ఎరువులను సకాలంలో అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ఈ సందర్భంగా పలు దుకాణాల్లో ఎరువులు, విత్తనాల స్టాక్ వివరాలను తహసీల్దార్ పరిశీలించారు.



నవీపేటలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, ఇతర అధికారులు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి

గ్రూప్-1 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతి కుమారి

నిజామాబాద్ అర్బన్, జూన్ 6: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9న జరగనున్న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు పకడ్బందీంగా ఏర్పాట్లు చేయాలని సీఎస్ శాంతికుమారి జిల్లాలోని కలెక్టర్లను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి డీజీపీ రవిగుప్తా, టీఎస్ పీఎస్సీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డిలతో కలసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలను సమీక్షించారు. ఎరువులు విత్తనాల కొరత లేకుండా చూడాలని, స్కూల్ యూనిఫాంలు సకాలంతో అందేలా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ ద్వారా మంచి నీటి సరఫరా, కలెక్టరేట్ సహా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ప్లాస్టిక్ బాటిళ్లను వినియోగించకుండా చూడాలని ఆమె ఆదేశించారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతంగా నిర్వహించినందుకు కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలను అభినందించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంత్ సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీఆర్‌డీవో సాయాగౌడ్, డీపీవో తరున్ చక్రవర్తి, డీఈవో దుర్గప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ఓటమిపై ఆరా!

కాంగ్రెస్ ఓటమిపై పార్టీ అధిష్ఠానం గుర్రు

- పార్టీ నేతల సమన్వయం, ఇతర అంశాలపై సమీక్ష
- అవకాశం ఉన్నా.. ఓటమిపాలు కావడంపై నేతల గుర్రు
- పార్లమెంట్‌ల వారీగా ఏఐసీసీకి నివేదిక పంపిన నేతలు
- ఓటమిని జీర్ణించుకోలేకపోతున్న జిల్లా స్థాయి నేతలు
- నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఓటమి ప్రభావం చూపే ఛాన్స్

నిజామాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా.. నిజామాబాద్‌లో ఓడిపోవడం పార్టీ అధిష్ఠానం ఆరాతీస్తోంది. పార్లమెంట్ పరిధిలోని మూడు అసెంబ్లీ సెగ్మెంట్లలోనే మెజార్టీ వచ్చినా.. మిగతా నియోజకవర్గాల్లో తగ్గిపోవడంతో పార్టీ శ్రేణులతో చర్చిస్తోంది. రాష్ట్రస్థాయిలో సమీక్షించడంతో పాటు ఏ నియోజకవర్గంలో ఎంతమేరకు తగ్గిందో ఓట్ల లెక్కలకు అనుగుణంగా సమీక్షిస్తున్నారు. ఎక్కడెక్కడ నేతలు పనిచేశారో, ఏ చోట చేయలేదో వివరాలను తీసుకోవడంతో పాటు రాష్ట్రస్థాయి సమావేశంలో చర్చించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ఫలితంపై కొంత అసహనం వ్యక్తం చేయగా వచ్చే రోజుల్లో ఈ ఫలితం బట్టే పదవులను కూడా నామినేటెడ్ పదవులను కూడా ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బోధన్, నిజామాబాద్ అర్బన్, జగిత్యాలలో నేతలు పనిచేసినట్లు ఇతర నియోజకవర్గాల్లో సమష్టిగా పనిచేస్తే బయటపడే అవకాశం ఉన్న గెలుపుపై ధీమాతో నేతలు గ్రామస్థాయిలో సమన్వయం చేయకపోవడం వల్ల ఈ ఓటమిపాలైనట్లు వారు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొంత మంది నేతల నుంచి వివరాలను కూడా సేకరించినట్లు పార్టీ నేతల సమాచారం బట్టి తెలిసింది. నియోజకవర్గాల వారీగా సమీక్షించి ప్రాథమిక నివేదికను ఏఐసీసీ నేతలకు పంపించినట్లు పార్టీ నేతల సమాచారం బట్టి తెలిసింది. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఏడు నియోజకవర్గాలు ఉండగా రెండింటిలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉండగా, మూడింటిలో బీఆర్ఎస్, రెండింటిలో బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ రెండవ స్థానంలో నిలిచింది. బీజేపీ సీటు కైవసం చేసుకోగా కాంగ్రెస్ ఓటు బ్యాంకును మాత్రం పెంచుకుంది. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి 5లక్షల 92వేల318 ఓట్లు సాధించగా కాంగ్రెస్ అభ్యర్థి 4లక్షల 83వేల077 ఓట్లను సాధించారు. బీఆర్ఎస్ అభ్యర్థి లక్షా 2వేల406 ఓట్లను సాధించారు. కాంగ్రెస్ అభ్యర్థి కంటే బీజేపీ అభ్యర్థి లక్షా 9వేల240 ఓట్లు ఎక్కువగా సాధించి గెలుపొందారు. పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలను పరిశీలిస్తే మూడు నియోజకవర్గాలు మినహా మిగతా నాలుగు నియోజకవర్గాల్లో భారీగా ఓట్లు తక్కువగా వచ్చాయి.

సీటు కోల్పోవడంపై సీరియస్

ఈ ఎన్నికల్లో ఎంపీ సీటును కోల్పోవడం వల్ల రాష్ట్రస్థాయిలో సీఎంతో సహా రాష్ట్ర ఇంచార్జిలు, పార్టీ సీనియర్ నేతలు సీరియస్‌గా ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో కర్నాటక మంత్రి బోసురాజును ఇంచార్జిగా నియమించారు. ఆయన పార్లమెంట్ పరిధిలో సమన్వయం చేశారు. కొన్ని నియోజకవర్గాల్లో పూర్తిస్థాయిలో పట్టించుకోకపోవడం వల్ల ఓటమిచెందినట్లు గుర్తించి పార్టీ నేతలు ఏఐసీసీకి నివేదించినట్లు తెలుస్తోంది. భవిష్యత్తులో నామినేటెడ్ పోస్టుల భర్తీలో కూడా ఈ ఎన్నికల ఫలితాల ప్రభావం ఉండనున్నట్లు సమాచారం. రాష్ట్రస్థాయి నామినేటెడ్ పోస్టులతో పాటు జిల్లా స్థాయి నామినేటెడ్ పోస్టుల్లో కూడా ఈ ప్రభావం ఉండే అవకాశం కనిపిస్తోంది. కాంగ్రెస్ అభ్యర్థి ఓటమి చెందిన తర్వాత పార్టీ నేతల్లో కూడా చర్చ ఎక్కువగా కొనసాగుతోంది.

బోధన్ నియోజకవర్గంలో మెజారిటీ..

ఎమ్మెల్యే పూర్తిస్థాయిలో నజర్ పెట్టడంలో బోధన్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికి బీజేపీ అభ్యర్థి కంటే 13,194 ఓట్లు అత్యధికంగా వచ్చాయి. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో ఈ దఫా ఎక్కువగా నజర్ పెట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ మంత్రి షబ్బీర్‌అలీ ఓటమిపాలు కావడంతో పార్లమెంట్ ఎన్నికల కోసం వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ నగరంలోని అడ్డావేసి సమీక్షించారు. అందరితో చర్చలు జరిపి నేతలందరూ సమన్వయంతో పనిచేసే విధంగా చూశారు. షబ్బీర్‌అలీతో పాటు పార్టీ నగర అధ్యక్షుడు కేశవేణు, ఇతర నేతలు కలిసికట్టుగా పనిచేయడంతో బీజేపీ అభ్యర్థికంటే 15,809 ఓట్లు కాంగ్రెస్ అభ్యర్థికి బీజేపీకంటే ఎక్కువగా వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిది జగిత్యాల నియోజకవర్గం కావడంతో బీజేపీ అభ్యర్థికంటే స్వల్పంగా 1847 ఓట్లు ఎక్కువగా వచ్చాయి. ఆయన నియోజకవర్గం సమన్వయం చేసుకుంటూనే ఇతర నియోజకవర్గాల్లో ప్రచారంలో పాల్గొన్నారు. ఈ మూడు నియోజకవర్గాల్లో కొంత మెజార్టీ రాగా మిగతా నియోజకవర్గాల్లో అనుకున్న విధంగా రాకపోవడం వల్ల అభ్యర్థి ఓటమిపాలయ్యారు. మిగతా నాలుగు నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థికి కాంగ్రెస్ అభ్యర్థికంటే ఎక్కువగా ఓట్లు వచ్చాయి. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థికి కాంగ్రెస్ అభ్యర్థికంటే 44,800 ఓట్లు అత్యధికంగా ఓట్లు సాధించారు. ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉండగా ఓట్లు మాత్రం ఎక్కువగా బీజేపీ అభ్యర్థికే వచ్చాయి. ఆర్మూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికంటే బీజేపీ అభ్యర్థికి 28,669 ఓట్లు వచ్చాయి. ఈ నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యే ఉండగా అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేయడంతో ఓటింగ్ శాతం పెరిగింది. బాల్కొండ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థికి కాంగ్రెస్ అభ్యర్థికంటే 32,172 ఓట్లు ఎక్కువగా వచ్చాయి. కోరుట్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికంటే బీజేపీ అభ్యర్థికి 32,952 ఓట్లు ఎక్కువగా వచ్చాయి.

మతం పేరుతో ఓట్లు అడిగింది అర్వింద్!

● కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, జూన్ 6: పార్లమెంట్ ఎన్నికల్లో అభివృద్ధి పేరుతో కాకుండా మతం పేరుతో ఓట్లు అడిగిన అర్వింద్‌కు కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేసే నైతిక హక్కు లేదని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం కాంగ్రెస్ కార్యాలయంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, నగర అధ్యక్షుడు కేశవేణులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ మతం పేరుతో ఓట్లు అడిగిందని అర్వింద్ అనడం సిగ్గుచేటని, మతం పేరుతో బీజేపీ నాయకులే ఓట్లు అడిగారని ఆయన అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మహిళా సంఘాలకు డబ్బులు పంచిన అర్వింద్ కాంగ్రెస్ పార్టీ డబ్బులు పంచిందనడం సిగ్గుచేటన్నారు. అభివృద్ధి విషయంలో గానీ, మతం పేరుతో ఓట్లు అడిగిన విషయంలో కానీ అర్వింద్ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డిపై అర్వింద్ విమర్శలు సరికాదని జిల్లా అభివృద్ధిలో సుదర్శన్‌రెడ్డి పాత్ర ఎంతో ఉందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు లోపాయికారి ఒప్పందం వల్లే కాంగ్రెస్ పార్టీకి ఓట్లు తగ్గాయని మోహన్‌రెడ్డి అన్నారు.

తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టే యత్నం

● అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

పెద్దబజార్, జూన్ 6: సోనియా గాంధీ మెప్పు కోసం తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మండిపడ్డారు. గురువారం నగరంలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సోనియాగాంధీని నాడు బలిదేవత అన్న రేవంత్ రెడ్డి నేడు తెలంగాణ తల్లి అంటూ కీర్తిస్తున్నారని ఆమె పుట్టినరోజు డిసెంబర్ 9న తెలంగాణ తల్లి ఉత్సవాలు నిర్వహించడాన్ని ఖండిస్తున్నామన్నారు. సెప్టెంబరు 17న తెలంగాణ విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహించాలన్నారు. ఇటీవల జరిగిన ఎంపీ ఎన్నికల్లో 15 స్థానాలు గెలుస్తామని గొప్పలు చెప్పుకున్న సీఎం రేవంత్‌రెడ్డి కనీసం 10 సీట్లు కూడా గెలవలేకపోయాడని ఎద్దేవా చేశారు. సమావేశంలో న్యాలం రాజు, లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.



ఖరీఫ్ సీజన్‌కు సిద్ధమవుతున్న రైతన్నలు



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతులు

పెద్ద కొడప్‌గల్, జూన్ 6: జుక్కల్ నియోజకవర్గ వ్యాప్తంగా రైతన్నలు ఖరీఫ్ సాగు కోసం సిద్ధమవుతున్నారు. జుక్కల్ నియోజక వర్గంలోని నిజాంసాగర్, పిట్లం మండలాలు కమాండ్ ఏరియాలో ఉండగా, పెద్ద కొడప్‌గల్, జుక్కల్, మద్నూర్, బిచ్కుంద మండలాలు నాన్‌కమాండ్ ఏరియాలో ఉన్నాయి. పిట్లం, నిజాంసాగర్ మండలాలతో పాటు బిచ్కుంద మండలంలోని కొన్ని గ్రామాలలో వరిపంట సాగు చేస్తారు. ఇక పెద్ద కొడప్‌గల్, జుక్కల్, మద్నూర్ మండలాల పరిధిలో ఆరుతడి పంటలు సాగు చేస్తారు. ఆరుతడి పంటలు సాగు చేసేందుకు సమయం రావడంతో రైతన్నలు తమ పంటచేలలో ఉన్న వ్యర్థాలను కాల్చివేయడంతో పాటు, ఇటీవల కురిసిన వర్షాలకు దుక్కులు రావడంతో పంట వేసేందుకు ట్రాక్టర్లతో దుక్కులు దున్నుతున్నారు. పంట చేలను సిద్ధం చేసుకుని వర్షాలు కురిసిన తర్వాత విత్తనాలు వేసేందుకు రైతన్నలు సిద్ధంగా ఉన్నారు. ఆరుతడి పంటలు పండించే రైతులు ఈ పాటికే సోయా, పత్తి లాంటి విత్తనాలను తీసుకవచ్చి సిద్ధంగా ఉంచారు. వర్షాలు కురియడమే తరువాయి విత్తనాలు విత్తేందుకు సిద్ధంగా ఉన్నామని రైతులు తెలిపారు. అంతేగాకుండ పంటచేలకు బలం ఉండేందుకు గాను ఈ పాటికే చెరవుల మట్టిని పొలాలకు తరలించారు,



చేనులో పంట వ్యర్థాలను కాల్చుతున్న రైతు


ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఎస్‌ఈ శ్రీనివాస్‌రావుగుప్తా

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పనుల పరిశీలన

మెండోర, జూన్‌6: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎస్‌ఈ శ్రీనివాస్ పదవీ విరమణ పొందడంతో నూతనంగా వచ్చిన శ్రీనివాస్‌రావు గుప్తా గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కరీంనగర్ ఎఫ్ఎఫ్‌సీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహించి శ్రీరాంసాగర్ ఎస్‌ఈగా పూర్తి అదనపు బా ధ్యతలు తీసుకున్నారు. పదవీ బాధ్యతలతో పాటు ప్రాజెక్టుపై కొనసా గుతు న్న ప్రాజెక్టు వరదగేట్ల మరమ్మతు పనులను పరిశీలించారు. కొనసాగు తు న్న వరద గేట్ల పనుల వివరాలను ఆరా తీశారు. మిగిలిన వరద గేట్ల మర మ్మతు పనులకు చురుకుగా సాగేలా చర్యలు చేపడుతామన్నారు. ప్రా జెక్టు అధికారులు గత ఏడాది ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో వివరాలను ఎస్‌ఈకి వివ రించారు. ఈ కార్యక్ర మంలో ప్రాజెక్టు ఈఈ చక్రపాణి, డీఈ గణేష్, ఏఈఈ వంశీ, తదితరులు పాల్గొన్నారు.

'బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి'


గోవింద్‌పేట్‌లో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఆర్మూర్‌రూరల్, జూన్‌6: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని మండల విద్యాధికారి రాజ గంగారాం విద్యార్థుల తల్లిదండ్రులకు సూచిం చారు. గురువారం మండలంలోని గోవింద్‌పేట్, ఇస్సాపల్లి గ్రామాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఈనెల 19వ తేదీ వరకు బడిబాట కార్యక్ర మం నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బడిఈడు పిల్లలను సమీప పాఠశాలలో చేర్పిం చ డానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు.ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: ఈనెల 6నుంచి 11 వరకు బడిబాట కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు పాలుపంచుకోవాలని విద్యాశాఖ అధికారులు కోరారు. కోరట్‌పల్లిలో గురువారం బడిబాట కార్యక్రమాన్ని జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు బడిఈడు గల విద్యార్థులను పాఠశాలలో చేర్పించి బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపాధ్యాయు లు కోరారు. ఈసందర్భంగా గ్రామస్థులకు బడి బాట తాలూకు కరపత్రా లను ఉపాధ్యాయులు అందజేశారు.

వేల్పూర్: మండలంలోని బడిబాట కార్యక్రమాన్ని గురువారం ఉపాధ్యాయులు, గ్రామస్థాయి అధికారులు ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ఉపాధ్యాయులు, గ్రామస్థాయి అధికారులు ఇంటింటికి సర్వే చేస్తూ ప్రభుత్వ పాఠశాలలో చేరని వారిని గుర్తించి పిల్లలను చేర్పించుకునే కార్యమం నిర్వహించారు. అందులో భాగంగానే కుకునూర్ గ్రామంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చరణ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు రవీందర్, మహేందర్, కృష్ణ, అశోక్‌లు ఇంటింటికి సర్వే నుంచి ఏడుగురి గుర్తించి ప్రభుత్వం పాఠశాలలో చేర్పించారు. ఉపాధ్యాయులతో పాటు అంగన్‌వాడి టీచర్‌లు, ఆశ వర్కర్‌లు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన బడిబాట కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించినట్లు ఎంఈవో గణేష్ రావు తెలిపారు. ఈ బడిబాట కార్యక్రమం ఈ నెల 19వరకు కొనసాగుతుందని తెలిపారు. దూపల్లి గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించం జరిగిందని ఆయన అన్నారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందుతుందని, ప్రైవేటు పాఠశాలలకు కాకుండా ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని అన్నారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యనభ్యసించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు సోమలింగం గౌడ్, సాయిరెడ్డి, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు సాయన్న, శ్రీనివాస్, శ్రీధర్, అమ్మఆదర్శ పాఠశాల చైర్మన్ సాయిప్రియ తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: బడి బయట పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండలంలోని కల్దుర్కి పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటి బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యబోధన గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగయ్య, ఏపీసీ చైర్మన్ ఎస్.ఎంటీ.రేఖ, ఉపాధ్యాయ బృందం తదితరులున్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లోని పాఠశాలలో గురువారం బాడిబాట కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని తొర్లికొండ గ్రామంలో ఎంఈవో శ్రీనివాస్ బడిబాట కార్యక్రమం ప్రారంభించి కరపత్రాలను ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలలోని నాణ్యమైన విద్యబోధన అందించడం జరుగుతుందని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు.ఈకార్యక్రమంలో హెచ్‌ఎంలు,టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముప్కాల్: పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా రూపొందించిన బడిబాట కార్యక్రమం గురువారం బాల్కొండ మండలంలో ప్రారంభించినట్టు ఎంఈవో బట్టు రాజేశ్వర్ తెలిపారు. జూన్ 6నుంచి 19వ తేదీ వరకు చేపట్టే బాడిబాట కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, మండలస్థాయి, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాలు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, విద్యార్థి తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. గ్రామంలో విలేజ్ ఆర్గనైజేషన్ సమావేశం ఏర్పాటు చేసుకొని ఎంత మంది పిల్లలు ఉన్నారో నమోదు చేసుకొని ప్రతీ ఇంటికి వెళ్లి బడి ఈడు పిల్లలను గుర్తించాల న్నారు. ఈనెల 8నుంచి 10వ తేదీ వరకు అంగన్‌వాడి కేంద్రాలను సందర్శించి తల్లిదండ్రుల్లో చదువుపై అవగాహన కల్పించి పిల్లలను బడికి పంపేలా కార్యక్రమాలు చేపట్టాల న్నారు. 11వ తేదీన గ్రామసభ ఏర్పాటు చేసి మూడు నుంచి పది వరకు చేపట్టిన కార్యక్రమాలపై చర్చించాలని, 12వ తేదీన పండుగ వాతావరణంలో పాఠశాలలను పునఃప్రారంభించాలని, నూతన విద్యార్థులకు స్వాగతం పలకాలన్నారు.13న తొలిమెట్టు కార్యక్రమం, 14న సామూహిక అక్షర భ్యాసం, 15న గర్లచైల్డ్ ఎడ్యుకేషన్, 18 డిజిటల్ తరగతులపై అవగాహన 19న ఆటల పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రభుత్వం ప్రతీ పేద విద్యార్థికి కార్పోరేట్ విద్యను అందించేలా చర్యలు తీసుకుం టుంద న్నారు. 19వ తేదీ వరకు బడి బాట కార్యక్రమం నిర్వహించి గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు అందరి సహకారంతో విజయవంతం చేయాలని ఆయన తెలిపారు.ఈకార్యక్రమంలో బాల్కొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, మహిళ సమాఖ్య అధ్యక్షుడు ఏపీఎం గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

● డీఈవో దుర్గాప్రసాద్


స్టేషన్ ఏరియా నీటిట్యాంకును పరిశీలిస్తున్న డీఈవో

నవీపేట,జూన్‌6: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని డీఈవో దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం నవీపేటలోని జడ్పీహెచ్ఎస్ బాలుర, బాలికల పాఠశాలలు, చావిడి సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలతో పాటు స్టేషన్ ఏరియాలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులచే విద్యార్థులకు బోధన చేయడంతో పాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలను అందించడం జరుగుతుందని అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యంతో పాటు భవనాలు, మరుగుదొడ్ల మరమ్మతుల పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. పాఠశాలలు పునః ప్రారంభం అయ్యేలోగా పనులను పూర్తి చేయాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. నవీపేట జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో ప్రహరి గోడ ఎత్తును పెంచడంతో పాటు పాఠశాల ఆవరణలో ఉన్న హైటెన్షన్ విద్యుత్ స్తంభాలను తొలగించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.ఈసందర్భంగా బడిబాటతో పాటు స్టేషన్ ఏరియా పాఠశాలలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు.ఈకార్యక్రమంలో ఎంపీడీవో నాగనాథ్, ఇన్‌చార్జి ఎంఈవో గణేష్‌రావు,పంచాయతీ రాజ్ ఏఈ శ్రావణ్ కుమార్, స్టేషన్ ఏరియా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సరితా రాణి, భరత్ కుమార్, తదితరులున్నారు.

దుబాయ్‌లో బోధన్ యువకుడి మృతి

బోధన్‌రూరల్,జూన్‌6: బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ ప్రాంతానికి చెందిన అఫైస్(25)అనే యువకుడు దుబాయ్‌లో స్విమ్మింగ్ చేయడానికి వెళ్లి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. 3నెలల క్రితం దుబాయ్‌లో పని చేయడానికి వెళ్లిన యువకుడు అతడి స్నేహితులతో కలిసి స్విమ్మింగ్ చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందినట్లు స్థానికులు పేర్కొన్నారు. 3నెలల క్రితం పనుల కోసం వెళ్లి మృత్యువాత పడ్డాడని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు.

తొలకరి వర్షాలు ప్రారంభం

నవీపేట,జూన్‌6: మండలంలోని పలు గ్రామాలలో గురువారం తొలకరి వర్షాలు కురిశాయి. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత అధికంగా ఉండగా సాయంత్రానికి వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు జరిగి ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో వేసవి తాపాన్ని భరించిన ప్రజలు తొలకరి వర్షాలు కురియడంతో ఉపశమనం పొందారు. రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించడానికి సిద్ధం అవుతున్నారు.

కళ్యాపూర్ శివారులో పిడుగుపడి వ్యక్తి మృతి


మృతి చెందిన పీర్యానాయక్

రెంజల్,జూన్‌6: మండలంలోని దండిగుట్ట గ్రామానికి చెందిన బానోత్ పీర్యా నాయక్(65) పిడుగు పడి మృతి చెందాడు. దండిగుట్ట గ్రామానికి చలెందిన పీర్యా నాయక్ గేదెలను తోలుకుని కళ్యాపూర్ శివారులో గేదెలు మేపడానికి వెళ్లగా భారీ ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులు రాగా అదే సమయంలో కళ్యాపూర్ శివారులోని మామిడి చెట్టుపై పిడుగు పడడంతో పీర్యానాయక్ చెట్టు కిందనే మృతి చెందాడు.ఇంటికి పెద్ద దిక్కుగా ఉన్న పీర్యానాయక్ చనిపోవడంతో దండిగుట్ట గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి.గత 8నెలల క్రితం కుమారుడు అనారోగ్యంతో చనిపోవడంతో ఇంట్లో పెద్ద దిక్కుగా ఉన్న పీర్యానాయక్ కూడా చనిపోవడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తగిన సహాయాన్ని అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

అమ్దాపూర్‌లో పిడుగు పాటుకు గేదె మృతి

బోధన్‌రూరల్,జూన్‌6: గురువారం ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో పిడుగు పడింది. అమ్దాపూర్ గ్రామానికి చెందిన రమేష్ అనే పాడి రైతులకు చెందిన పాడి గేదె మేతకు వెళ్లగా పిడుగు పాటుకు గురై వ్యవసాయ క్షేత్రంలో మృతి చెందినట్లు స్థానిక రైతులు తెలిపారు. బాధితుడి జీవనాధారం పాడి గేదెపైనే ఆధారపడి ఉందని, ప్రభుత్వం రైతును ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవీపేట,జూన్‌6: మండల కేంద్రంలోని సుభాష్ నగర్ కాలనీకి చెందిన బోదన్‌కర్ పెద్ద రాజేశ్వర్(55) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. మృతుడు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, ఈ నెల 3న గుర్తు తెలియని పురుగుల మందును సేవించగా వెంటనే అతనిని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. చికిత్స పొందుతూ రాజేశ్వర్ గురువారం మృతి చెందాడని ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడి కుమారుడు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పుప్పాలపల్లిలో ట్రాన్స్‌ఫార్మర్‌ల నుంచి ఆయిల్ చోరీ

జక్రాన్‌పల్లి, జూన్‌6: మండలంలోని పుప్పాలపల్లి గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌పార్మర్‌ల నుంచి ఆలూల్ చోరి చేసినట్టు రైతులు, గ్రామస్థులు తెలిపారు. గ్రామంలోని చెరువు ప్రాంతంలో వ్యవసాయ తోట్లకు సంబంధించిన ట్రాన్స్‌పార్మన్‌లను ధ్వంసం చేసి ఆయిల్ చోరీ చేశారని, దీంతో వ్యవసాయ తోటలో పండిస్తున్న పంటలకు కరెంటు సరఫరా లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని, వేసిన విత్తనాలకు మొలకెత్తగా సాగునీరు అందడంలేదని రైతులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సీహెచ్.తిరుపతి తెలిపారు.

మోర్తాడ్‌లో పేకాట రాయుళ్ల అరెస్టు

మోర్తాడ్,జూన్‌6:మోర్తాడ్ శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేశామని ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. గురువారం మోర్తాడ్ శివారులో మోర్తాడ్‌కు చెందిన నలుగురు పేకాట ఆడుతున్న సమాచారం మేరకు దాడి చేశామని తెలిపారు. రూ.16వేల 570లను స్వాధీనం చేసుకొని నలుగురిని అరెస్టు చేసి కేసునమోదు చేశామని ఎస్సై తెలిపారు.

జీలుగ విత్తనాల పంపిణీ

మాక్లూర్,జూన్‌6:మాక్లూర్ వ్యవసాయ సహకార సంఘం పరిధి లోని కల్లెడి, గుత్ప,మాక్లూర్, మాదాపూర్,రాంచంద్రపల్లి, ఢీకంపల్లి,చిక్లి, చిన్నాపూర్, మామిడిపల్లి గ్రామాల్లోని కేంద్రాలలో గురువారం సొసైటీ చైర్మన్ బూరోల్ల అశోక్ జీలుగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఏవోపద్మ, ఏపీవోఉమాదేవితో పాటు రైతులు పాల్గొ న్నారు.

డొంకేశ్వర్‌లో సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు

డొంకేశ్వర్,జూన్ 6:డొంకేశ్వర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తు కారణంగా శుక్రవారం నుంచి వారం రోజుల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ గాయాస్ షైమద్ తెలిపారు. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా మండలంలోని నికాల్‌పూర్, డొంకేశ్వర్ గ్రామాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు. ఉదయం 8నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన వెల్లడిం చారు. దీనికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కార్పొరేట్ ఫీజులను నియంత్రించాలి

- గుర్తింపు లేని జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి : ఏఐఎస్ఎఫ్

నిజామాబాద్ అర్బన్, జూన్ 6:జిల్లాలో ప్రైవేటు కార్పొరేట్ కళాశాలల్లో ఫీజు నియంత్రణ లేదని, అడ్మిషన్ల ముసుగులో ఫీజుల పేరుతో దోచుకుంటున్నారని అలాంటి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం డీఐఈవో రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రఘురాం మాట్లాడుతూ జిల్లాలో గుర్తింపులేని అనేక కళాశాలలు అడ్మిషన్లు తీసుకుంటున్నారని అకాడమీ పేర్లతో ఇంటర్మీడియెట్ అడ్మిషన్లు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఇంటర్ అడ్మిషన్లు చేస్తున్న అకాడమీలపై క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. గుర్తింపులేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అన్ని రకాల వసతులను ఏర్పాటు చేయాలన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో లక్షలాది ఫీజులు వసూలు చేస్తున్నా ఇంటర్ విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుకుంటున్నవిద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని మరుగుదొడ్లు, మూత్రశాలలు ఏర్పాటు చేయాలని, శిథిలావస్థలో ఉన్న పాత భవనాల స్థానంలో నూతన భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అంజలి, కుశాల్ పాల్గొన్నారు.


డీఐఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కళాశాల ఫీజుల వివరాలు ప్రదర్శించాలి...

ప్రైవేటు జూనియర్ కళాశాలలు తమ కళాశాలల్లో ఫీజుల వివరాలను ప్రదర్శించాలని ఏబీవీఎస్‌యు ఆధ్వర్యంలో గురువారం డీఐఈవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా బాధ్యుడు అనిల్ మాట్లాడుతూ ప్రైవేటు కళాశాలలు పీఆర్‌వోల ద్వారా అడ్మిషన్లను తీసుకుంటున్నారని అదేవిధంగా అధిక ఫీజులు వసూలు చేయడంతో పాటు మెటీరియల్, బుక్స్ పేరుతో ఫీజులు వసూలు చేస్తున్నారని కావున అలాంటి కళాశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. అడ్మిషన్లకు ముందు ఒకలాగా, అడ్మిషన్ల తర్వాత మరొకలాగా కళాశాలలు ఫీజులు మారుస్తున్నారని దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని కావున వెంటనే ఫీజులను కళాశాలల్లో ప్రదర్శించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భీమ్, అంకుష్, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ సొసైటీపై కేసు నమోదు

రెంజల్,జూన్6:మండల కేంద్రంలోని రెంజల్ వ్యవసాయ సహకార సంఘంపై కేసునమోదు చేసినట్లు వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు. నిత్యావసర వస్తువుల చట్టం 6ఏ కింద ఈసీ ఏసీటీ 1955 ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ ఎఫ్‌టీవో 1985 ప్రకారం కేసు నమోదు చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదికను పంపించినట్లు వ్యవసాయ అధికారి లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు. ఈవోపీవోఎస్ మిషన్ ద్వారా ఎరువుల విక్రయాలు జరుపకుండా ఈవోపీవోఎస్ మిషన్ స్టాక్, గ్రౌండ్ స్టాక్‌కు మధ్య అధిక వ్యత్యాసం ఉన్నందున క్యాష్, క్రెడిట్ బిల్లులు రైతులకు అందించకుండా ఎరువుల వ్యాపారం నిర్వహించడం జరిగినందుకు సహకార సంఘంపై చర్యలు తీసుకొనుటకు జిల్లా కలెక్టర్‌కు, జిల్లా సహకార సంఘం అధికారికి నివేదికను అందించడం జరిగిందన్నారు. కలెక్టర్‌కు నివేదిక పంపించడం జరిగిందని లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం


వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పెద్దబజార్, జూన్ 6: స్వామియే శరణం అయ్యప్ప, అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచారసభ ఆధ్వర్యంలో గురువారం అమావాస్య సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మప్రచారసభ జిల్లా అధ్యక్షుడు మూడశ్రీనివాస్‌గుప్త మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు గత నాలుగుసంవత్సరాలుగా చేస్తున్నామని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే నగరంలోని దుబ్బ ప్రాంతంలో గల ప్రభుత్వ పాఠశాలలో వంద మంది పేద విద్యార్థులకు నోటుపుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మల్లేష్, వంశీధర్, శివశంకర్, శ్రీకాంత్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

ఇందల్వాయి, జూన్ 6: ఇందల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గన్నారం ముఖద్వారం వద్ద 44వ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డుప్రమాదంలో యువకునికి తీవ్రగాయాలయ్యాయి. గురువారం ఇందల్వాయి మండలంలోని సిర్నాపల్లి గ్రామపరిధిలో గల రాంసాగర్ తండాకు చెందిన జీవన్ అనే యువకుడు సిర్నాపల్లి నుంచి ఇందల్వాయి వెళ్తుండగా గన్నారం వద్ద ద్విచక్రవాహనంపై రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపువెళ్తున్న కారు అతివేగంగా ఢీకొట్టింది. కారు ఢీకొట్టగానే యువకుడు బైక్‌పై నుంచి ఎగిరి కిందపడిపోయాడని, తల రోడ్డుకు తగలడంతో తలకు బలమైన గాయాలు అయ్యాయన్నారు. వెంటనే టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

రెండు లారీలు ఢీ... తప్పిన ప్రమాదం

ఇందల్వాయి మండలంలోని చంద్రయాన్‌పల్లి వద్ద 44వ జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీకొన్నాయి. హైదరాబాద్ నుంచి ఇందల్వాయి వైపు వస్తున్న లారీలను వెనక నుండి వచ్చిన లారీ అతివేగంగా ముందు లారీని ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. వెనక లారీలో ఉన్న డ్రైవర్ ముందు లారీని ఢీకొట్టి లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. స్థానికులు డ్రైవర్‌ను లారీలోంచి బయటకు తీసి కాపాడారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు.

లోక్‌అదాలత్‌ను వినియోగించుకోండి

నిజామాబాద్ లీగల్, జూన్ 6:జిల్లా మొత్తంగా 11 బెంచీలతో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవా సంస్థ ఛైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయాధికారిణి సునీత కుంచాల గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కక్షిదారులు రాజీకి దగిన కేసులను రాజీ కుదుర్చుకొని ఈ లోక్‌అదాలత్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సైబర్‌క్రైమ్ బాధితులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జిల్లా మొత్తంగా 11 బెంచీలను ఏర్పాటు చేయడం జరిగిందని అందులో జిల్లా కోర్టులో 5, బోధన్ కోర్టులో 4, ఆర్మూర్ కోర్టులో 2 బెంచీలు, మొత్తం 11 బెంచీలతో జాతీయ లోక్‌అదాలత్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయసేవా సంస్థ కార్యదర్శి పి.పద్మావతి, సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రం పరిశీలన

ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన


ఆరోగ్య ఉపకేంద్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

మోస్రా,జూన్6:ఆరోగ్యఉపక్రేందాన్ని పలువురు పరిశీలించారు. మంగళవారం ప్రచురితమైన శిథిలావస్థలో ఆరోగ్య ఉప కేంద్రం అనే కథనానికి మండల కాంగ్రెస్ నాయకులు, మండల వైద్య అధికారి డాక్టర్ విజయ్ కుమార్‌లు స్పందించారు. ఆరోగ్య ఉపకేంద్రాన్ని పరిశీలించి, సమస్య పరిష్కారం కోసం నూతన భవనం నిర్మాణం కోసం బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రవీందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్యను పూర్తిగా పరిష్కారం చేస్తామని, అప్పటి వరకు సమస్య లేకుండా ఓ ప్రైవేట్ భవనంలో ఏర్పాటు చేస్తామని మండల కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ సాయమ్మ, ఏఎన్ఎం విజయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్, బీసీసెల్ అధ్యక్షుడు బొజ్జ శ్రీనివాస్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, మోస్రా గ్రామ మాజీ అధ్యక్షుడు నర్సారెడ్డి, సీనియర్ నాయకులు హరినారాయణ, బిల్లారాజు, సతీష్, ఇలియాజ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన వారికి జరిమానా

ఖిల్లా, జూన్ 6:మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి కోర్టు భారీగా జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ నారాయణ తెలిపారు. సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు వాహనాలను తనిఖీ చేస్తుండగా 19 మంది మద్యం తాగి వాహనాలు నడిపినట్లు గుర్తించామన్నారు. వీరికి కౌన్సిలింగ్ నిర్వహించి కోర్టు ఎదుట హాజరుపర్చగా 18 మందికి 46వేల రూపాయల జరిమానా, మరో వ్యక్తికి ఒక నెలపాటు జైలుశిక్ష విధించినట్లు తెలిపారు. ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ వెంకటనారాయణ నేతృత్వంలో తనిఖీలు చేపట్టామని తెలిపారు.

పనులు పూర్తి చేయండి : రూరల్ ఎమ్మెల్యే

మోపాల్, జూన్ 6:నగర సమీపంలో ఉన్న బోర్గాం(పి) ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ మరమ్మతు పనులను రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి గురువారం పరిశీలించారు. అమ్మ ఆదర్శ మరమ్మతుల కోసం ప్రభుత్వం 22లక్షలు మంజూరు కాగా వీటికింద జరుగుతున్న పనులు పరిశీలించారు. మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలకు అమ్మ ఆదర్శ పనుల కోసం పెద్దమొత్తంలో నిధులు మంజూరు అయ్యాయని, పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్నారు.


పనులు పరిశీలిస్తున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

గిరిజన తండాలపై ఎక్సైజ్ అధికారుల దాడులు

మోపాల్, జూన్ 6:మండలంలోని గిరిజన తండాలో గిరిజనులు గుడుంబా తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో గురువారం తెల్లవారుజామున ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎక్సైజ్ సీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు 25 మంది సిబ్బందితో కలిసి మూకుమ్మడిగా దాడులు నిర్వహించారు. మండలంలోని మంచిప్ప తండా, బైరాపూర్, కాల్పోల్, రామేశ్వర్‌పూర్‌తండా, గుడితండాతో పాటు చుట్టుపక్కల ఉన్న తండాలపై అధికారులు దాడులు నిర్వహించారు. తండాలో గుడుంబా తయారుచేస్తే కఠినంగా చర్యలు ఉంటాయని గిరిజనులకు హెచ్చరించారు. ఇద్దరు వ్యక్తులు గుడుంబా తయారు చేస్తుండగా వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశామన్నారు. దాడిలో ఎక్సైజ్ సీఐ దిలీప్, వెంకటేశ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ విలాస్, ఎక్సైజ్ ఎస్సై మల్లేష్, నర్సింహాచారి, నారాయణరెడ్డి, సిబ్బంది ఉన్నారు.


గిరిజన తండాలో దాడులు చేసిన ఎక్సైజ్ అధికారులు

ధన్‌పాల్‌ను కలిసిన ఐఎంఏ వైద్యులు


ధన్‌పాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పెద్దబజార్, జూన్ 6: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి పుష్పగుచ్చం అందజేశారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు దామోదర్‌రావు, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, ఉపాధ్యక్షులు విశాల్‌ఆకుల, కోశాధికారి రాజేంద్రప్రసాద్, సీనియర్ వైద్యులు రామ్మోహన్‌రావు, చంద్రశేఖర్‌రావు, జీవన్‌రావు, వినోద్‌కుమార్‌గుప్త, రవీంద్రనాథ్‌సూరి, సత్యనారాయణ, రాజేశ్, నర్సింగ్‌హోం అసోసియేషన్ కార్యదర్శి వైద్యులు రాజేశ్, భూమారెడ్డి, చంద్రశేఖర్, ప్రజ్ఞ, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

బోధన్‌లో పోలీసు, ఆర్టీఏ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు

బోధన్‌రూరల్,జూన్6: వాహనదారులు తప్పకుండా తమ ధ్రువీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలని, కాలం చెల్లిన వాహనాలను నడిపిస్తే సీజ్ చేయడం జరుగుతుందని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ హెచ్చరించారు. గురువారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బోధన్, ఆర్టీఏ అధికారులు సంయుక్తంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన వాహన ధ్రువపత్రాలు లేని వాహననాలను పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ వాహనదారులు తప్పకుండా తమ లైసెన్స్‌లు వెంట ఉంచుకోవాలని హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా వాహనదారులు నెంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలని, నెంబర్‌ప్లేట్ లేకుండా వాహనాలు నడిపిస్తే సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ఒక్క ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు ప్రయాణించడం నేరమని పేర్కొన్నారు. వాహనదారులు ఆర్టీఏ నియమ, నిబంధనలను తప్పకుండా పాటించాలని లేనియెడల కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాత వాహనాలను నడిపించవద్దని సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను తప్పకుండా సీజ్ చేయబడతాయన్నారు. కార్యక్రమంలో బోధన్ ఎంవీఐ శ్రీనివాస్, సీఐ వీరయ్యలతో పోలీసులు, ఆర్టీఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

ధర్పల్లి, జూన్ 6: మండల కేంద్రంలో గల చాణక్య టెక్నాలజీ ఆధ్వర్యంలో 110 మంది విద్యార్థిని విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇచ్చారు. ఈ మేరకు గురువారం విద్యార్థులకు సంబంధిత సర్టిఫికెట్లను అందజేశారు. పరీక్షలు నిర్వహించిన అనంతరం ఉత్తీర్ణులైన విద్యార్థులకు ధృవీకరణ పత్రాలను అందజేశారు. బ్యాచ్‌ల వారిగా చాణక్య కంప్యూటర్స్‌లో ఎస్సెస్సీ, ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఈ అవకాశాన్ని కల్పించారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఈ సందర్భంగా ప్రిన్సిపల్ చాట్ల ప్రణీత్, చాట్ల వాణిలు అభినందించారు. ఈ సర్టిఫికెట్లు దేశంలో ఎక్కడైనా వినియోగించుకోవచ్చని వారు తెలిపారు. అదేవిధంగా పదవతరగతిలో 10 జీపీఏ సాధించిన మేఘన, అక్షయలను సన్మానించారు.

'ఇంటింటి సర్వే నిర్వహించండి'

ఇందల్వాయి, జూన్ 6:ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్యవిస్తీర్ణ అధికారి శంకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆరోగ్య కేంద్రంలో వృద్ధులకు ఉచితంగా బీసీజీ వ్యాక్సినేషన్ ఇవ్వడానికి వీలుగా అవసరమైన కార్యాచరణలో భాగంగా ఆశాకార్యకర్తలు ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. ఎవరికి ఈ టీకా ఇవ్వాలి, ఎవరికి ఇవ్వకూడదో పూర్తిగా వివరించడం జరిగిందన్నారు. సర్వే చేసేటప్పుడు హెచ్ఐవి బాధితులు, గర్భిణీలు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ఉన్నట్లయితే వారికి ఈ వ్యాక్సినేషన్ ఇవ్వకూడదని తెలిపారు. క్షయవ్యాధి, డయాబెటిక్, పొగతాగుతున్న వారికి ఈ వ్యాక్సినేషన్ ఇవ్వాలని సూచించారు. క్షయవ్యాధి నిర్ధారణ కొరకు తెమడ నమూనాలను సేకరించాలని ఆశాకార్యకర్తలను ఆదేశించారు. ప్రతీ శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్ అలీ, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి లక్ష్మీగణపతి ఆలయంలో శ్రీలక్ష్మి మహాయాగం


యజ్ఞం పనులు పరిశీలిస్తున్న ఆలయ వ్యవస్థాపకులు అరుణ్‌శర్మ

మోపాల్, జూన్ 6:నగరంలోని బోర్గాం(పి) గ్రామంలో ఉన్న లక్ష్మీగణపతి ఆలయంలో శుక్రవారం నుంచి శ్రీలక్ష్మీ మహాయాగము మూడురోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు అరుణ్‌శర్మ తెలిపారు. ప్రజలు ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్న, రుణబాధల తొలగింపు కోసం, వ్యాపార, వ్యవసాయంలో అభివృద్ధికై, ఉద్యోగ, ఇతర అన్ని వర్గాల ఆర్థిక అభివృద్ధికై ప్రత్యేకంగా తలపెట్టిన కార్యక్రమానికి జగద్గురు శ్రీ శారదా పీఠాధీశ్వరులు ఆశీస్సులతో శ్రీశ్రీశ్రీ భారతీ తీర్థ మహాస్వామి, శ్రీశ్రీశ్రీ విదుశేఖర భారతీమహాస్వామి ఆశీస్సులతో ఈ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు అరుణ్‌శర్మ వివరించారు. 7, 8, 9 తేదీలలో ఈ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. ఈ ఉత్సవాల సందర్భంగా ప్రతిరోజు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయంలో యజ్ఞయాగశాలలను గురువారం పలువురు పరిశీలించారు. కార్యక్రమంలో భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

నగరంలో దొంగల బీభత్సం

ఖిల్లా, జూన్ 6: నగరంలోని బస్వాగార్డెన్ సమీపంలో గల రుత్విక్ అపార్ట్‌మెంట్‌లో తాళం వేసిన ఫ్లాట్‌లలో గుర్తుతెలియని దుండగులు తాళాలు పగలగొట్టి దొంగతనానికి పాల్పడిన ఘటన గురువారం తెల్లవారుజామున 4వ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. నాల్గవ టౌన్ ఎస్సై సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం బస్వాగార్డెన్ వద్ద నివాసం ఉంటున్న రెండు కుటుంబాలు సెలవులు ఉండటం వల్ల ఒక కుటుంబం తీర్థయాత్రలకు, మరో కుటుంబం హైదరాబాద్‌కు వెళ్లారన్నారు. దీనిని గమనించిన గుర్తుతెలియని దుండగులు తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. గాయత్రీనగర్‌లో నివాసం ఉండే స్వరూపరాణి కొడుకు హైదరాబాద్ వెళ్లడంతో ఆయన ఇంట్లో బీరువాను ధ్వంసం చేసి సుమారు మూడున్నర తులాల బంగారాన్ని అపహరించినట్లు తమకు ఫిర్యాదు వచ్చిందని పోలీసులు తెలిపారు. మరో కుటుంబస్తులు లేకపోవడంతో వారి ఇంట్లో ఏఏ వస్తువులు దొంగతనానికి గురయ్యాయో తెలియరాలేదని, వారు వచ్చిన తర్వాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు. దొంగతనం జరిగిన సమాచారం తెలుసుకొని అపార్ట్‌మెంట్‌కు వెళ్లి వివరాలను సేకరించినట్లు తెలిపారు. దొంగల ఆచూకీ కోసం సీసీ కెమెరాల ద్వారా పరిశీలిస్తున్నామని తెలిపారు.

'బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలి'

నిజామాబాద్ అర్బన్, జూన్ 6:బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని స్టేట్ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ధర్మేందర్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం ఎస్టీయూ భవన్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సెప్టెంబర్‌లో నిలిచిపోయిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలని, ఈనెల చివరి నాటికి ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. గతంలో బదిలీ జరిగి రిలీవ్ కాని వారిని వెంటనే రిలీవ్ చేయాలని ఆయన కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమయ్యేనాటికి ప్రతీ పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని కోరారు. పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో శ్రీనివాస్, వాసు, మహేశ్వర్, పవన్, గంగాకిషన్, సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.270	రూ. 290
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.275	రూ. 295

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.72,700	రూ.67,000	రూ.910

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

సినిమాలు దేవి : గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్: రక్షణ (11.00, 6.00)
: వెపన్ (2.00, 9.00)
విజయ్ : మనమే (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్
స్క్రీన్-1 : మనమే (10.50, 4.35, 7.35, 10.30)
: రక్షణ (1.45)
స్క్రీన్-2 : రక్షణ (10.25)
: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (1.30, 7.30)
: సత్యభామ (4.30)
: భజే వాయువేగం (10.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-3 : లవ్ మౌళీ (10.40)
: బ్యాడ్ బాయ్స్ (1.45, 7.45)
: వెపన్ (4.40)
: సత్యభామ (10.30)

పీవీఆర్ మల్టిప్లెక్స్ (వేణుమాల్)
స్క్రీన్-1 : మనమే (10.20, 10.20)
: ముంజియా (హిందీ) (1.35)
: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి(4.20)
: సత్యభామ (7.25)
స్క్రీన్-2 : బ్యాడ్ బాయ్స్ (10.30, 4.30, 10.30)
: మనమే (1.15, 7.15)
స్క్రీన్-3 : సత్యభామ (11.25, 10.40)
: భజే వాయువేగం (2.20)
: వెపన్ (5.15)
: ముంజియా (హిందీ) (7.55)
స్క్రీన్-4 : గోల్డ్ నెంబర్-1 (10.30)
: లవ్ మౌళీ (1.20)
: గంగం గణేషా (4.25)
: రక్షణ (7.30)
: గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి (10.30

- నిజామాబాద్ అర్బన్